సాక్షి
శ్రీకాకుళం
సోమవారం : 28 : ఆగస్టు : 2023

న్యూస్‌రీల్

పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పలు స్థానాలకు విశాఖపట్నం రేంజి వీఆర్‌లో ఉన్న సీఐలు విధుల్లో చేరనున్నట్లు జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదలైంది. ఎన్.కామేశ్వరరావు శ్రీకాకుళం ట్రాఫిక్ పీఎస్ అటాచ్డ్ గార పీఎస్‌కు, పి.కోటేశ్వరరావు శ్రీకాకుళం డీఎస్బీ (జిల్లా స్పెషల్ బ్రాంచి), శీరా భాస్కరరావు శ్రీకాకుళం దిశా పీఎస్‌కు, ఎస్.రామకృష్ణ శ్రీకాకుళం వీఆర్‌కు బదిలీపై రానున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పార్వతీ పురం (మన్యం) జిల్లా వీఆర్‌కు ఎస్.వేణుగోపాలరావుకు పోస్టింగ్ ఇచ్చారు.

అంతర్జాతీయ పోటీలకు కిరణ్‌కుమారి యాదవ్


తల్లిదండ్రులతో అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన కిరణ్‌కుమారి యాదవ్


సోంపేట: అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న వరల్డ్ లాక్ క్రాస్ ఉమెన్స్ సిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు లండ కిరణ్‌కుమారి యాదవ్ ఎంపికయ్యారు. కెనడాలోని అక్టోబర్ 6, 8 తేదీల్లో జరుగనున్న పోటీలకు దేశం నుంచి ఆరుగురిని ఎంపిక చేయగా అందులో కిరణ్‌కుమారి ఒకరు. ఈమెది సోంపేట మండలం మామిడిపల్లి గ్రామం. కుమార్తె అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో తండ్రి సూర్యనారాయణ ఇంటి సభ్యులతో సంబరం జరుపుకున్నారు. తన కుమార్తెకు విద్యను నేర్పిన గురువు సురేంద్రరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు సార్వత్రిక సూత్రాలు పాటించాలి


ప్రకృతి వ్యవసాయ శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంలో రైతులు సార్వత్రిక సూత్రాలు పాటించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ సాగుపై మూడో రోజు శిక్షణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఏడాది మొత్తం పంటలు సాగయ్యేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. పంటల్లో జీవ వైవిధ్యం పాటించాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుల మందు వ్యవసాయం అవసరమని తెలిపారు. బీజామృతం, జీవామృతంలు భూసారానికి దోహద పడతాయని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రకాష్, హేమసుందర్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్



పోటీల్లో కైవసం చేసుకున్న మెడల్స్, సర్టిఫికెట్లతో ఖగేశ్వరరావు

నరసన్నపేట: మండలం గొట్టిపల్లి వద్ద ఏతపేటకు చెందిన ఖగేశ్వరరావు సౌత్ ఏషియన్ ఇంటర్నేషనల్ గేమ్స్‌లో బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. బెంగళూరులోని సంబరం ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో 25 నుంచి 27 వరకూ ఇంటర్నేషనల్ ఆల్ స్పోర్ట్స్, గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు యోగా, కర్ర సాముల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఖగేశ్వరరావు యోగా విభాగంలో బంగారు పతకం, కర్ర సాములో రజతం దక్కించుకున్నారు. విజయవాడ ఎఫ్‌సీఐలో పనిచేస్తున్న ఖగేశ్వరరావు గతంలో కూడా పలు పోటీల్లో సత్తా చాటి జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేశారు.





రాఖీల సందడి

మార్కెట్‌లో రాఖీ సందడి కనిపిస్తోంది. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 31న రాఖీ పండగ జరగనుంది. ఈ సందర్భంగా రూ.25 నుంచి రూ.1000ల వరకు ధర కలిగిన రాఖీలు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. చిన్న చిన్న పూసలతో తయారుచేసిన రాఖీల నుంచి పెద్ద బొమ్మలతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న రాఖీలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

–శ్రీకాకుళం కల్చరల్



నగరం మోసపోతున్న వేళ!

- ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న వారిలో అధికులు విద్యాధికులే
- పల్లెల్లో కంటే నగరాలు, పట్టణాల్లోనే ఈ తరహా మోసాలు అధికం
- ఇతర రాష్ట్రాలకు వెళ్లి మరీ దర్యాప్తు చేస్తున్న పోలీసులు



శ్రీకాకుళం క్రైమ్ : యాప్‌ల వాడకంపై సాటిలేని పెత్తనం. ఆన్‌లైన్ బ్రౌజింగ్ విషయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు తీసిపోని అవగాహన. అన్ని సామాజిక మాధ్యమాల్లో అకౌంట్లు. సెల్‌ఫోన్ గురించి లెక్చర్లు ఇచ్చేంత జ్ఞానం... కానీ ఏం లాభం.? ఇన్ని తెలిసీ నగర వాసులు సైబర్ వలలో సులభంగా చిక్కుకుపోతున్నారు. జిల్లాలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాల్లో పల్లెల కంటే పట్టణాలే అధికంగా మోసపోతున్నాయి. నిరక్షరాస్యుల కంటే విద్యాధికులే ఎక్కువగా అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

సరికొత్త టెక్నాలజీతో..

ఇంటర్నెట్ యుగంలో నేరగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ప్రజలను ఎలా మోసం చేయాలన్న దానిపై రోజురోజుకీ అప్‌గ్రేడ్ అవుతున్నారు.రకరకాల మోసాలతో ప్రజలను ఏమార్చి బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారు. పల్లెల్లో కన్నా పట్టణాల్లో ఉన్న విజ్ఞానులే అత్యాశతో మోసపోతున్నారు. జిల్లాలో ఇలాంటి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు.. నేరస్తులను పట్టుకునేందుకు ఎస్పీ జీఆర్ రాధిక ఇతర రాష్ట్రాలకు ఇప్పటికే ఏడు బృందాలను పంపించారు. వెళ్లిన వారంతా కేసుల్లో ఉన్న 118 మందిని గుర్తించి (వెరిఫై చేసి) 40 మందికి 41–ఏ నోటీసులు జారీ చేసి వెనక్కి వచ్చారు. 70 కేసుల్లో 60 వరకు చార్జిషీట్లు సిద్ధం చేశారు. కేసులు ఫైనలైజ్ అయ్యాక కోర్టుకు మెమోలు సమర్పిస్తారు. ఈ డబ్బై కేసుల్లో మెజారిటీ కేసులు పట్టణాలకు చెందినవి కావడం గమనార్హం.


గురుగ్రామ్‌లో శ్రీకాకుళం పోలీసులు (ఫైల్ చిత్రం)

ఇలా మోసగిస్తున్నారు..

- ఎస్‌బీఐ యోనో అకౌంట్‌కు కేవైసీ అప్‌డేట్ అంటూ, సిమ్ కార్డు ఎక్స్పైరీ అయిపోయిందంటూ ఓటీపీలు అడిగి మోసం చేస్తున్నారు.
- ఓఎల్‌ఎక్స్ యాప్‌లో, గూగుల్ సెర్చ్‌లో టాస్కులు, ఆ తర్వాత బహుమతులు, ఆ బహుమతులు దక్కించుకోవడానికి డబ్బులు వేయమనడం అంటూ ఓ పద్ధతిలో ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.
- హనీట్రాప్‌లు కూడా సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్నాయి. అమ్మాయిల పేరుతో వల వేయడం, ప్రేమలో దింపడం, డబ్బులు లాగేయడం జిల్లాలో కూడా జరిగాయి. శ్రీకాకుళానికి చెందిన ఓ వ్యక్తి రూ.7 లక్షలు మోసపోయాడు.
- లండన్‌లో ఓ మహిళ (ఇక్కడోడే) ఎఫ్‌బీలో ఓ పోస్టు పెట్టి 'నాకు క్యాన్సర్ వ్యాధి వచ్చేసింది. కొద్దిరోజులే బతుకుతాను. నా వద్ద రూ. 2.5 బిలియన్ల డాలర్ల కరెన్సీ ఉంది. అనాథ శరణాలయానికి డొనేట్ చేసేస్తాను' అని రాయడంతో అది చూసిన శ్రీకాకుళం రూరల్‌కు చెందిన వ్యక్తి ఆ డబ్బంతా కొట్టేయొచ్చనుకున్నాడు. కరెన్సీని మార్చాలంటూ ఆ ఫేక్ యువతి చెప్పడంతో చివరకు రూ.7 లక్షలకు అతడికి టోపీ పడింది.
- ఇవే కాకుండా పలు ఆన్‌లైన్ మార్కెటింగ్ కస్టమర్ కేర్ల పేర్లతోనూ మోసాలు జరుగుతున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



ప్రజలు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలు అవే తగ్గుతాయి. మా దగ్గర కొచ్చే నేరాల్లో జాబ్ ఫ్రాడ్, లాటరీ, ఆన్‌లైన్ టాస్క్‌లు, ఎలక్ట్రిసిటీ బిల్లులు, కేవైసీ అప్‌డేట్‌లు ఎక్కువగా ఉన్నాయి.

– పప్పల శ్రీనివాసరావు, సీఐ, శ్రీకాకుళం టూటౌన్

విజ్ఞులే అధికం..



పల్లెల్లో పెద్దగా మోసాలు జరగకున్నా పట్టణాల్లో విజ్ఞులైన వారే మోసపోతున్నారు. ఎస్పీ ఆదేశాలతో విద్యాసంస్థల్లో, గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. సర్కిల్ పరిధి 10 వరకు కేసులు చార్జిషీట్ సిద్ధం చేశాం.

– లెంక సన్యాసినాయుడు, సీఐ, శ్రీకాకుళం వన్‌టౌన్

సైబర్ నేరాలు అరికట్టేందుకు..



సైబర్ నేరాలను అరికట్టేందుకు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న నేరస్తులను గుర్తించేందుకు బృందాలను పంపించాం. 60 కేసుల వరకు చార్జిషీట్లు సిద్ధం చేశాం. ప్రజలు మరింత అప్రమత్తతతో ఉండి సైబర్ వలలో పడకుండా జాగ్రత్త పడాలి. మోసానికి గురైన తక్షణమే 1930కు ఫోన్ చేసి సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇస్తే వారి అకౌంట్లు ఫ్రీజ్ చేసి రికవరీ చేసేందుకు వీలుంటుంది. – జీఆర్ రాధిక, ఎస్పీ, శ్రీకాకుళం


హరియాణా ఎన్‌యూహెచ్‌లో స్థానికులను విచారిస్తున్న శ్రీకాకుళం పోలీసులు (ఫైల్)

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి


తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: శ్రావణ మాసం ఆదివారం మత త్రయ ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఊరేగించారు.

ఫ్లోరింగ్ కోసం రూ. లక్ష విరాళం


విరాళ నగదును సీనియర్ అసిస్టెంట్‌కు అందజేస్తున్న దాత వెంకటేష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉచిత దర్శన భక్తుల క్యూకాంప్లెక్స్‌లో ఫ్లోరింగ్ కోసం అల్లు వెంకటేష్ రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. ఆదివారం ఆయన విరాళ నగదును ఆయన తల్లిదండ్రులు అల్లు హటకేశం, గుణవతమ్మల పేరిట విరాళంగా ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, బిఎస్.చక్రవర్తి, నేతేటి హరిప్రసాద్‌శర్మ తదితరులున్నారు.

జై మత్స్యకార.. జై జగనన్న!


నాటి మత్స్యకార మహాసభలో మాట్లాడుతున్న వైఎస్సార్ (ఫైల్)

- 31న హార్బర్ వద్ద మత్స్యకార మహాసభ
- ఉత్తరాంధ్ర నుంచి భారీగా హాజరుకానున్న మత్స్యకారులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పథకాలకు కృతజ్ఞతలు తెలపనున్న నేతలు
- 2003 ఏప్రిల్‌లో విశాఖలో ఈ తరహా సదస్సు
- నాటి సభకు ప్రతిపక్ష నేతగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాజరు

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. అందుకుగాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పడానికి మత్స్యకారులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 31న విశాఖ ఫిషింగ్ హార్బర్ వద్ద రాష్ట్రంలోనే తొలిసారిగా మత్స్యకార మహాసభను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 2003 ఏప్రిల్ 4న మత్స్యకారులు ఇలాంటి మహాసభనే విశాఖలో నిర్వహించారు. ఆర్కే బీచ్‌లో నిర్వహించిన ఆ మహాసభలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. సరిగ్గా ఇరవయ్యేళ్ల తర్వాత ఇప్పుడు 'జై మత్స్యకార.. జై జగనన్న' పేరిట మత్స్యకార మహాసభను నిర్వహిస్తున్నారు. 31 సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగే ఈ మహాసభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మత్స్యకారులు, మత్స్యకార నేతలు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మత్స్యకారుల బతుకులు ఎంతగానో మెరుగుపడ్డాయి. సముద్రంలో చేపలవేటపై రెండు నెలల పాటు నిషేధం అమలు సమయానికి వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద వీరికి రూ.10 వేలు చెల్లిస్తోంది. గత ప్రభుత్వంలో ఈ సొమ్ము రూ.4 వేలు మాత్రమే ఇచ్చేది. మత్స్యకార బీమా సొమ్మును రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో బోట్లకు సరఫరా చేసే డీజిల్‌పై లీటరుకు రూ.6 సబ్సిడీ ఇచ్చేది. అది కూడా ఆర్నెల్లు, ఏడాది తర్వాతో చెల్లించేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సబ్సిడీ సొమ్మును రూ.6 నుంచి 9కి పెంచడమే కాదు.. ముందుగానే మత్స్యకారుల ఖాతాలో రాయితీ మొత్తం జమ అవుతోంది.

అంతేకాదు.. మునుపటి ప్రభుత్వంలా కాకుండా అన్ని మెకనైజ్డ్, మోటారు బోట్లకు ఈ రాయితీని వర్తింపజేస్తోంది. అలాగే రూ.152 కోట్ల వ్యయంతో విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ జరుగుతోంది. ఇలా సంక్షేమ పథకాలే కాకుండా మత్స్యకారుల జీవితాలు బాగు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పది ఫిషింగ్ హార్బర్లు, ఏడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, పోర్టులను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా వేల సంఖ్యలో మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

హాజరుకానున్న మత్స్యకార నేతలు

మహాసభకు మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, తీరప్రాంత ఎమ్మెల్యేలు, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మత్స్యకార నేతలు హాజరు కానున్నారు. నాటి మత్స్యకార మహాసభలో వైఎస్‌తో పాటు మోపిదేవి, మల్లాడి కృష్ణారావులు పాల్గొనగా, 31న జరగబోయే మహాసభకు కూడా వీరిద్దరూ హాజరవుతుండడం విశేషం! ప్రజలకు, మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపడానికి, ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో ఈ మత్స్యకార మహాసభను ఏర్పాటు చేస్తున్నామని ఈ సభ నిర్వాహకుడు, రాష్ట్ర మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ 'సాక్షి'కి చెప్పారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

మందస,కాశీబుగ్గ: మండలంలోని సువర్ణాపురం పంచాయతీ గుడ్డిభద్ర గ్రామంలో టీడీపీకి చెందిన పలు కుటుంబాలు రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరాయి. డొక్కరి రాంబాబు, జనార్ధన, తెప్పల జగన్నాథం, జుత్తు దూర్వాసులు, గేదెల నారాయణరావు, కీలు చామంతి, గేదెల లక్ష్మి, తెప్పల జయమ్మ తదితరులకు మంత్రి అప్పలరాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ విధి, విధానాలు నచ్చక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరామన్నారు. మంత్రి సీదిరి మాట్లాడుతూ పార్టీలోకి ఇటీవల చేరికలు ఎక్కువవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరి సేవలను గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సువర్ణాపురం పంచాయతీ అధ్యక్షుడు జుత్తు శంకరరావు, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సార్ర ఢిల్లేశ్వరరావు, దున్న హరికృష్ణ, బొడ్డు చిన్నారావు, దున్న బుజ్జి, కోదండరావు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

గొంతు నులిమి చంపేశారు

- జిల్లా కేంద్రంలో వ్యక్తి దారుణ హత్య
- హత్యపై అనుమానాలెన్నో..
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు


ఘటనా స్థలిలో డీఎస్పీ శృతి, క్లూస్ బృందాలు


పరుపుపైనే మృతదేహం


మృతుడు నర్సింగరావు (నేతాజీ) (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన హత్య స్థానికంగా కలకలం రేపుతోంది. నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన ఇంటి నర్సింగరావు అలియాస్ నేతాజీ (53)ని గొంతు నులిమి చంపేశారు. మృతుడిపై గతంలో రౌడీషీట్ ఉండడం, కుటుంబంలో ఆస్తి తగాదాలు నడుస్తుండడం, కుటుంబ సభ్యులతోనే ఆర్థిక లావాదేవీలు ఉండడంతో ఆయన హత్యపై ఎన్నో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఒకటో పట్టణ పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..

ఏపీహెచ్‌బీ కాలనీలో ఉంటున్న నర్సింగరావుకు పాతికేళ్ల కిందట రూప అనే మహిళతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె హైదరాబాద్‌లో జాబ్ చేస్తుండగా.. మరొకరు బీటెక్ చదువుతున్నారు. నర్సింగరావు వ్యాపారాల్లో నష్టపోవడంతో ఆయన భార్యే కుటుంబ బాధ్యతలు చూసుకుంటున్నారు. వారి ఎదురింటిలో ఉన్న మహిళకు ఈ మధ్యనే పక్షవాతం రావడంతో.. ఆమెకు సపర్యలు చేసే పనిలో నర్సింగరావు భార్య రాధ చేరారు. నెల జీతానికి అక్కడ పనికి కుదిరి రాత్రిళ్లు వారి ఇంటిలోనే నిద్రించేవారు. శనివారం రాత్రి కూడా ఇంటిలో పనులన్నీ ముగించుకుని ఎప్పటిలాగానే చిన్నకుమార్తెతో పాటు నిద్రపోవడానికి ఎదురింటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూస్తే మంచంపై భర్త చలనం లేకుండా పడి ఉన్నారు. తాగి పడుకున్నారేమో అని ఆమె పట్టించుకోలేదు. అయితే ఎంత సేపటికీ ఆయన లేవకపోవడంతో అక్కడే పాన్‌షాపు నడిపే నర్సింగరావు స్నేహితుడికి విషయం చెప్పారు. అతను వచ్చి చూసి నర్సింగరావు మృతి చెందినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన డీఎస్పీ యర్రగుంట శృతి, సీఐ లెంక సన్యాసినాయుడు, ఎస్‌ఐ బలివాడ గణేష్, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలికి చేరి మృతదేహాన్ని పరిశీలించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. మెడపై మాత్రం గట్టిగా అదిమినట్లు గుర్తులు ఉండడంతో గొంతు నులిమి హత్య చేసినట్లు నిర్ధారించారు. అనంతరం కుటుంబ సభ్యులను విచారించారు.

అనుమానాలెన్నో..

నర్సింగరావు హత్యపై ఎన్నో అనుమానాలు రేకెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులతో పోలీసులు నిర్వహించిన విచారణలోనూ అనేక విషయాలు వెలుగు చూశాయి. నర్సింగరావుపై 2005కు ముందు రౌడీ షీట్ ఉండేది. దీనికి తోడు కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈయనకు ఐదుగురు తోబుట్టువులు ఉన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల రూ.5.20 కోట్ల విలువైన స్థలంపై వీరు కోర్టుకు కూడా వెళ్లారు. ఈ స్థలాన్ని తన తండ్రి తనకే రాసిచ్చేశాడంటూ నర్సింగరావు రెండో సోదరుడు హరిప్రసాద్ విక్రయానికి పెట్టడంతో మూడేళ్ల కిందట మిగతా వారంతా కోర్టుకు వెళ్లారు. ఈ గొడవలే హత్యకు దారి తీశాయేమో అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. అలాగే నర్సింగరావు మొదటి సోదరి మంజుల భర్త చనిపోయాక వారికి రూ.20 లక్షలు డబ్బులు వచ్చాయి. ఆ డబ్బులు ఫైనాన్స్‌కు తిప్పుతానంటూ నర్సింగరావు అడిగి తీసుకున్నాడు. తర్వాత ఆ మొత్తాన్నీ నష్టపోయాడు. దీంతో మంజుల పెద్ద కుమారుడు కమల్, తన మిత్రుడు సాయితో కలిసి నర్సింగరావుతో గొడవ పడ్డారు. అతడి బండిని కూడా తగులబెట్టేశారు. ఈ కోణంలో కూడా దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

విచారణ చేస్తున్నాం..

కేసుపై విచారణాధికారి సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ.. హత్యపై తమకు ఫోన్ రావడంతో ఘటనా స్థలానికి వెళ్లామని, శనివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి వచ్చాడని ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, అంతే కాక ఎనిమిది నెలల కిందట వారి సోదరికి, అతనికి మధ్య ఆస్తికి సంబంధించిన తగాదాలున్నాయని ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి


వెంకటేష్ (ఫైల్)

పొందూరు: పొందూరు పంచాయతీ లక్ష్మీపేట సమీపంలో ఆదివారం అనకాపల్లి వెంకటేష్(14) అనే బాలుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పొందూరు నాయుడు వీధికి చెందిన అనకాపల్లి రాంబాబు, అలివేలు దంపతులు తాపీ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు వెంకటేష్ పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో లక్ష్మీపేటలో ఉన్న తాత కోవెల లచ్చుం ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో తాతగారి ఆవులను మేపాడు. అక్కడే మూడేళ్లుగా ఖాళీగా ఉంటున్న ఇంటి సమీపంలోకి ఆవులు వెళ్లడంతో కర్రను విసిరాడు. కర్ర ఇంటిపై పడింది. అదే ఇంటిపై నుంచి హెచ్‌టీ విద్యుత్ లైన్ వెళ్తోంది. ఇది గమనించని కుర్రాడు కర్రను తీసేందుకు వెళ్లి విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మనవడు ఎంతకూ రాకపోవడంతో వెంకటేష్ తండ్రి రాంబాబుకు ఫోన్ చేశాడు. తన ఇంటికి కూడా రాలేదని చెప్పడంతో చుట్టు పక్కల అంతా గాలించారు. చివరకు భవనం వద్ద విగతజీవిగా పడి ఉన్న వెంకటేష్‌ను చూసి నిశ్చేష్టులైపోయారు. స్థానికులు పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందజేశారు.

శాస్త్రవేత్తగా ఎంపికైన శ్రీవిద్యకు సత్కారం


శ్రీవిద్యను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

లావేరు: మండలంలోని పాతకుంకాం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు పడాల శ్రీనివాసరావు కుమార్తె పడాల శ్రీవిద్య ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపికైంది. విషయం తెలియడంతో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు లుకలాపు అప్పలనాయుడు, వట్టి సత్యన్నారాయణ, పైడి శ్రీనివాసరావు, కోష్ట సర్పంచ్ పిసిని హరినాయుడు, కొత్తకోట, గోవిందపురం పంచాయతీల మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, లావేరు హైస్కూల్ పీఎంసీ చైర్మన్ లంకలపల్లి మల్లేశ్వరరావులు పాతకుంకాం గ్రామానికి వెళ్లి శ్రీవిద్యను సత్కరించారు.

అదిగో పులి.. ఇదిగో పాదముద్ర

సరుబుజ్జిలి, హిరమండలం: పులిని ప్రత్యక్షంగా చూసిందెవ్వరూ లేరు గానీ ప్రతి చోటా సంచరిస్తోందంటూ ప్రచారాలు మాత్రం జోరుగా జరుగుతున్నాయి. తాజాగా సరుబుజ్జిలి మండలం వెన్నెవలస అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు చెబుతున్నారు. వెన్నెవలస రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతంలో పులి సంచరించినట్లు స్థానికులంటున్నారు. పాదముద్రలు చూపించి పులి తిరుగుతోందని చెబుతున్నారు. అలాగే వంశధార రిజర్వాయర్ గట్టుపై కూడా పాదముద్రలు కనిపించాయని అక్కడి వారు చెబుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి, ఉపాధ్యాయ రత్న' రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు–2023 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవార్డులను సెప్టెంబర్ 10 ఆదివారం అందిస్తామన్నారు. విద్యా బోధనతో పాటు, కల్చరల్, స్పోర్ట్స్, ఆర్ట్స్, యోగా ఉపాధ్యాయులు వారి విద్యార్హత, బోధన, శిక్షణ, అనుభవాలను తెలియజేసే సర్టిఫికెట్లు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తుకు జత చేసి ఈ నెల 31వ తేదీలోపు ఆల్‌దిబెస్ట్ అకాడమీ, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్‌కి పంపించాలని కోరారు. వివరాలకు 9652347207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు


హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

అర్హులందరికీ బియ్యం కార్డులు



మండలాల వారీగా కొత్త కార్డులు

మండలం	మంజూరైన కార్డులు	అందజేసిన కార్డులు	మండలం	మంజూరైన కార్డులు	అందజేసిన కార్డులు
అమదాలవలస	330	250	మందస	357	194
బూర్జ	188	143	మెళియాపుట్టి	192	97
ఎచ్చెర్ల	370	167	నందిగాం	298	173
జి.సిగడాం	288	174	నరసన్నపేట	408	220
గార	366	167	పలాస	324	205
హిరమండలం	128	71	పాతపట్నం	296	156
ఇచ్ఛాపురం	207	105	పోలాకి	295	151
జలుమూరు	301	196	పొందూరు	231	120
కంచిలి	265	104	రణస్థలం	494	492
కవిటి	90	19	సంతబొమ్మాళి	287	181
కోటబొమ్మాళి	319	198	సారవకోట	226	137
కొత్తూరు	233	115	సరుబుజ్జిలి	105	80
ఎల్ఎన్ పేట	31	21	సోంపేట	320	153
లావేరు	311	158	శ్రీకాకుళం	364	248
			టెక్కలి	327	166
			వజ్రపుకొత్తూరు	267	179
			మొత్తం	8218	4840

- జిల్లాకు కొత్తగా 8,218 బియ్యం కార్డులు జారీ
- సెప్టెంబర్ నుంచి రైస్ విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేదల సంక్షేమంలో ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఈ నెలలో జిల్లాకు కొత్తగా 8,218 బియ్యం కార్డులు మంజూరయ్యాయి. గతంలో కంటే మిన్నగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి అర్హులను గుర్తించి, వారికి కార్డు కోసం సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి, అర్హత ఉంటే వారికి రేషన్ కార్డులు అందజేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 6,60,204 బియ్యం కార్డులు ఉన్నాయి. రానున్న నెల నుంచి కొత్తగా వచ్చిన కార్డులకు కూడా బియ్యం అందజేయనున్నారు. కొత్తకార్డుతో కలిపి జిల్లాలో 6,68,422 కార్డులు కానున్నాయి.

సచివాలయాల్లో తీసుకోండి..

కొత్తగా వచ్చిన బియ్యం కార్డులను సచివాలయాల్లో లబ్ధిదారులు తీసుకోవాలి. సచివాలయాల్లోనే కొత్త కార్డులు ముద్రించనున్నారు. వలంటీర్ ద్వారా లబ్ధిదారులు థంబ్ వేసి కార్డు తీసుకోవచ్చు. ఇలా చేసిన కార్డులకు సెప్టెంబర్ నుంచి బియ్యం అందజేస్తారు. మొత్తం 8218 కార్డులు మంజూరు కాగా 4840 కార్డులు లబ్ధిదారులకు అందజేశారు. ఇప్పటివరకు 2461 కొత్తకార్డులకు వలంటీర్ యాప్‌లో అథంటికేషన్ పూర్తి చేశారు. మిగిలిన లబ్ధిదారులు అథంటికేషన్ చేయించుకోవాల్సి ఉంది.

అరసవల్లిలో శ్రావణ పూజల సందడి


పుష్కరిణిలో స్నానాలు చేస్తున్న భక్తులు


సూర్య నమస్కార పూజలు

అరసవల్లి: అరసవల్లిలో ఆదివారం శ్రావణ సందడి కనిపించింది. శ్రావణ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆదిత్యుడిని దర్శించుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక తులసీదళాలతో ఆదిత్యుడిని అలంకరించి ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయ అధికారులు భక్తులకు మౌలిక సౌకర్యాలను కల్పించేలా చర్యలు చేపట్టారు. స్వామిని విజయవాడ హౌసింగ్ కార్పొరేషన్ (అడ్మిన్) జనరల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఇక ప్రత్యేక, విశిష్ట, ప్రత్యేక దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ. 1,69,400, విరాళాల ద్వారా రూ.66,055, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2 లక్షల వరకు ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలియజేశారు.

నేడు జీడి రైతుల బైక్ ర్యాలీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన రైతులు పండించిన జీడి పంటకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని కోరుతూ సోమవారం ఉదయం 9 గంటలకు కంచిలి నుంచి పలాస వరకు చేపట్టనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం మండలం అధ్యక్షుడు కొర్నాన బాలాజీరావు, కార్యదర్శి భాస్కరరావు కోరారు. సీతాపురం, బొడ్డపాడు, గల్లి, నగరంపల్లి, తోటపల్లి, కూర్మనాథపురం తదితర గ్రామాల్లో ఆదివారం రైతులను కలిసి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైక్ యాత్ర కంచిలిలో ప్రారంభమై కవిటి, సోంపేట, మందస మండలాల మీదుగా పలాస వరకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, ప్రజా సంఘాలు, ఇతర పార్టీల నాయకులు పార్టీలకు అతీతంగా పాల్గొనాలని కోరారు.

బిల్డింగ్‌పై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య


భవనం పైనుంచి దూకిన తర్వాత విద్యార్థి లక్కయ్


రిమ్స్‌లో మృతదేహం వద్ద ఎస్ఐ లక్ష్మి

శ్రీకాకుళం క్రైమ్ : 'తండ్రీ యేసు ప్రభువా.. నన్ను క్షమించు.. నా చావు నేనే డిసైడ్ చేసుకున్నా.. ఈ దేశంలో నేనే అందర్నీ మోసగించా.. నేను చేసిన నేరాలకు అందరూ క్షమించండి'.. అంటూ సూసైడ్ లెటర్ రాసి ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రమైన మానసిక ఆందోళనతో బాధ పడుతున్న విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మన్యం (పార్వతీపురం) జిల్లా సీతంపేట మండలం సంకిలి గ్రామానికి చెందిన ఊయక లక్కయ్ (20) శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ ఎస్ఐ కె.లక్ష్మి, స్థానికులు, విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..

లక్కయ్ శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ఈ జూన్‌లో చేరాడు. ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు పోడు వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే జీవిస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల కిందట లక్కయ్ ఊరెళ్లగా కుటుంబ సభ్యులంతా సెలవులపై వచ్చాడనుకున్నారు. కానీ లక్కయ్ డల్‌గా కనిపిస్తూ రాత్రి పూట బైబిల్ చదువుతూ పరధ్యానంగా ఉండేవాడు. దీంతో సోదరుడు రాజేష్ లక్కయ్‌ను ప్రశ్నించగా తనకు చదువుపై ఇంట్రస్ట్ లేదని చెప్పాడు. ఈ నెల 25న చర్చికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చిన లక్కయ్ తిరిగి ఇంటికి వెళ్లలేదు. బంధువుల ఇంటికి వెళ్లుంటాడులే అని కుటుంబ సభ్యులంతా భావించారు.

ఈ నేపథ్యంలో లక్కయ్ ఆదివారం కాలేజీ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కనే గ్రౌండ్‌లో ఆడుకుంటున్న కుర్రాళ్లకు శబ్దం వినిపించడంతో వెళ్లి చూడగా.. లక్కయ్ నిస్సహాయంగా చూస్తూ కనిపించాడు. వెంటనే రిమ్స్‌కు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ కన్నుమూశాడు. అంతకుముందే వసతి గృహంలో పనిచేస్తున్న వై.అప్పలరాజు లక్కయ్ అన్నయ్య రాజేష్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. లక్కయ్ వారం రోజులుగా హాస్టల్‌లో లేడని, ఈ రోజు ఉదయం ఆర్ట్స్ కళాశాల మీద నుంచి దూకేశాడని.. రిమ్స్‌లో చేర్పించామని, చేతిలో ఏదో సూసైడ్ నోట్ రాసి ఉందని చెప్పారు. దీంతో వారంతా రిమ్స్‌కు చేరుకుని సూసైడ్ లెటర్‌ను చూడగా.. 'జీసస్ ఈజ్ మై ఎవ్రీథింగ్.. ఐలవ్యూ జీసస్.. ఫర్ యెవర్ ఫర్ యెవర్.. తండ్రీ యేసు ప్రభువా.. నన్ను క్షమించు.. నా చావు నేనే డిసైడ్ చేసుకున్నా.. ఈ దేశంలో నేనే అందర్నీ మోసగించా.. నేను చేసిన నేరాలకు అందరూ క్షమించండి' అని రాసి ఉంది.

ఈ విషయమై రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మిని వివరణ కోరగా విద్యార్థి సైకలాజికల్‌గా ఇబ్బంది పడుతూ ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని.. మేడ మీద నుంచి దూకడం వలన ఊపిరితిత్తులు ఛిద్రమయ్యాయని మిగతా భాగాల్లో ఎక్కడా గాయాలు లేవని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం పూర్తయ్యిందని చెప్పారు.

ఫొటో జర్నలిస్టులకు సత్కారాలు


ఫొటోగ్రాఫర్ జయశంకర్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో జరుగుతున్న వాస్తవ సంఘటనలకు నిలువెత్తు నిదర్శనం ఫొటో అని ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు అన్నారు. ఏపీయూడబ్ల్యూజే, స్వామ్నా, అరసం, ఇస్కఫ్, తెరవే తదితర సంస్థలు సంయుక్తంగా ఉత్తమ ఫొటో జర్నలిస్టులుగా ఇటీవల రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిన శ్రీకాకుళం జిల్లా వాసులను ఆదివారం శ్రీకాకుళంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో ఫొటోగ్రాఫర్‌ది ముఖ్యపాత్ర అని అన్నారు. ఒక ఫొటో ద్వారా చాలా వరకు సమాచారం తెలుసుకోవచ్చన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిన కె.జయశంకర్ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావు, వాకర్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు గేదెల ఇందిరాప్రసాద్, డీఏఎంసీ ఎస్.జోగినాయుడు, ఎస్.ఈశ్వరరావు, బెండి మోహనరావు, ఎం.శ్రీనివాస్, ఎం.వి.మల్లేశ్వరరావు, జి.వి నాగభూషణరావు, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


రిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

లావేరు: మండలంలోని బెజ్జిపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారి పక్కన ఈ నెల 26వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉండటంతో లావేరు పోలీసులు అతడిని 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అతను ఆదివారం వేకువజామున ఆస్పత్రిలో మృతి చెందారు. అతని వయసు 32 ఏళ్లు ఉంటుందని లావేరు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లేవని, మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, ఎవరి వద్దనైనా సమాచారం ఉంటే 6309990851 నంబర్‌కు తెలియజేయాలని ఎస్ఐ అన్నారు.



నేలతల్లికి పచ్చకోక

నరసన్నపేట మండలంలో వరి పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. వాతావరణం అనుకూలించడంతో సకాలంలో ఉభాలు పూర్తి చేశారు. గడిచిన నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఇలా పచ్చగా కనిపిస్తున్నాయి.

– నరసన్నపేట

నేడు మూడో విడత విద్యా దీవెన

- జిల్లాలో 51,337 మంది విద్యార్థులకు లబ్ధి

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన మూడో విడత నగదు సోమవారం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ కానుంది. ఇప్పటికే ఈ ఏడాది రెండు పర్యాయాలు ఈ నగదు విడుదల చేసిన ప్రభుత్వం మూడో విడతకు సిద్ధమైంది. చిత్తూరు జిల్లా నగరిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుంది. జిల్లాలో 51,337 మంది విద్యార్థులకు వారి తల్లుల ఖాతాల్లో రూ.33,07,02,435 లు జమచేయనున్నారు.

ఇదీ వరుస..

- ఎస్సీ విద్యార్థులు 3,939 మందికి గాను 3,629 మంది తల్లుల ఖాతాల్లో రూ. 2,71,10,56లు,
- ఎస్టీ విద్యార్థులు 1391 మందికి గాను 1,298 మంది తల్లులు ఖాతాల్లో రూ. 80,83,461లు,
- బీసీ విద్యార్థులు 43,540 మందికి గాను 39,309 మంది తల్లులు ఖాతాల్లో రూ.27,85,30,575 లు.
- ఈబీసీ విద్యార్థులు 1632 మందికి గాను 1,510 మంది తల్లులు ఖాతాల్లోరూ.1,05,10,804లు.
- ముస్లిం మైనారిటీ విద్యార్థులు 160 మందికి గాను 143 తల్లులు ఖాతాల్లో రూ.9,94,400లు.
- కాపు విద్యార్థులు 655 మందికి గాను 623 మంది తల్లులు ఖాతాల్లో రూ.52,87,718 లు,
- క్రిస్టియన్ విద్యార్థులు 20 మందికి గాను 18 మంది తల్లుల ఖాతాల్లోరూ. 1,84,621లు జమ కానున్నాయి.

తెలుగు భాష తొలి అడుగు గిడుగు


గిడుగు రామ్మూర్తి పంతులు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్, శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాష తొలి అడుగు గిడుగు రామ్మూర్తి పంతులు అని విద్యాభూషణ్ డాక్టర్ కేపీ రాములు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఈవేమన కవితా నిలయం, సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన)అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విద్యాభూషణ్ డాక్టర్ కేపీ రాములు హాజరయ్యారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన తెప్పల కృష్ణమూర్తి మాట్లాడుతూ గిడుగు సేవలు ఎనలేనివని అన్నారు. గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా మాట్లాడుతూ రామ్మూర్తి పంతులు శ్రీకాకుళం వాస్తవ్యులు కావడం మనందరికీ గర్వకారణమని అన్నారు. తెలుగును వాడుక భాషగా తీసుకొచ్చిన గిడుగు గొప్ప చిత్రకారులు, ఉపాధ్యాయులు అని అన్నారు. అనంతరం యువకవి కె.శ్రీను రాసిన ఆత్మతమోత్తత్మి ఆమ్మోదయం కవితా సంపుటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముందుగా కిమ్స్ ఆస్పత్రి రోడ్డులోని గిడుగు రామ్మూర్తి పంతులు విగ్రహానికి ఈవేమన కవితా నిలయం, సాహితీసంస్థ ప్రతినిధులు పుష్పమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేవదాస్ అనే బాలుడు పఠించిన శ్లోకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కలెక్షన్ కింగ్!


విదేశీ కరెన్సీ నోట్లు



పట్టాభిషేకం టంకా నాణెం




చరిత్రకు సాక్ష్యాలుగా పురాతన నాణేలు, కరెన్సీ నోట్లు (ఇన్‌సెట్లో) దుబ్బ శంకర్

ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరు సత్యసాయి హైస్కూల్లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దుబ్బ శంకర్ అపురూప నాణేలు, కరెన్సీని సేకరిస్తూ ప్రదర్శిస్తున్నారు. మండపల్లికి చెందిన శంకర్‌కు చిన్నతనం నుంచే ఈ హాబీ ఉంది. వివిధ లోహాల మిశ్రమంగా భావించే సీతారాముల పట్టాభిషేకం గల రామ టంకా నాణెం నుంచి మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే పదుల సంఖ్యలో నాణేలు, కరెన్సీ నోట్లను సేకరించారు. దుబాయ్, ఖతార్, నేపాల్, భూటాన్, శ్రీలంక తదితర దేశాల కరెన్సీతో పాటు ఫ్రెంచ్ నాణేలు, ముస్లిం పాలకుల సమయంలో వినియోగించిన నాణేలు సేకరించారు. మన అణా, రెండణాలు, పావు అణా, అర్ధణా, నయా పైసా, రెండు పైసాలు, మూడు పైసలు, ఐదు పైసలు, పది పైసలు, ఇరవై పైసలు ఇత్తడి నాణేలు కూడా ఆయన వద్ద ఉన్నాయి. భావి తరాలకు గత చరిత్ర తెలియజేయాలనే ఉద్దేశంతోనే వీటిని సేకరిస్తున్నానని శంకర్ తెలిపారు.

ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం


రైల్వే కాలువలో పడి ఉన్న ఆటో

టెక్కలి రూరల్: స్థానిక వలియాసాగరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం టెక్కలి నుంచి పోలవరం వైపు వెళ్తున్న ఓ ఆటో అదుపు తప్పి రైల్వే ట్రాక్ పక్కన ఉన్న కాలువలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎరువులు తీసుకెళ్తున్న ఈ వాహనం బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పినట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం క్రేన్ సాయంతో ఆటోను కాలువ నుంచి తొలగించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు వివరాలు సేకరించారు.